ప్రేమ ఫలితం

శ్రీమతి కర్రి కమలాదేవి

[అది వేసవి పున్నమ రేయి. వెన్నెట్లో సీత తన నీనీల కుంతలాన్ని సవరించుకుంటూ సిందూర తిలకాన్ని మాటి మాటికి దిద్దుకుంటూ ఎవరి కొరకో నిరీక్షిస్తున్నది. ఆలస్యమయిన కొలది తన శృంగారము చెదరి పోవునేమో యని బాధపడుతోంది పదమూడేండ్ల బాలిక సీత. ఆ సన్నని సరిగంచు నీలి చీరెలో నుండి ఆమె సౌందర్యము పొంగి పొరలి పోవుచున్నది. ప్రతీక్షణం వెను తిరిగి చూస్తుంది; పాపం... ఎవ్వరూ లేందే! ఎంతసేపని : నిరీక్షణ ? ఎంతబాధ? ఇకలోనికి పోనున్న సమయంలో బావ ఈల పాడుతూ వచ్చాడు. "సీతా! ఈరాత్రి సమయంలో ఈ తోటలో ఎందుకు కూర్చున్నావు? పద లోనికిపద" అన్నాడు బావ. "అబ్బ గట్టిగ కేకలెయ్యకు నీకోసమే కూర్చున్నాను. ఇంతసేపు ఎక్కడున్నావు?"

బావ:- నా బాధ నీకేం తెలుసునమ్మా? రోజంతా కష్టపడితే చాలక రాత్రికూడ పనిచేయమంటాడు మా దొర.

సీ:- ఆ పని మానెయ్యమని నేనెన్నో సార్లు చెప్పేను వినవు గదూ ...?

బా:- సరేలే నీకేం తెలుసును? ఇందాక కేకలెయ్యకన్నా వెందుకూ? ...

సీ:- పెళ్ళయిందగ్గర నుంచీ మా నాన్నగారు నీతో మాట్లాడవద్దన్నారు. బావా! మాట్లాడితేనేం? అందుకనే దొంగతనంగా ఈ చీకట్లో నక్కి నీ కోసం చూస్తున్నాను.

వాసుబావముఖం ఎఱ్ఱబడింది. ఒక నిట్టూర్పే దానికి జవాబు. నెమ్మదిగాముఖం క్రిందకు దించుకున్నాడు.

సీత:- "ఏం బావా! నీకు కోపం వచ్చిందా ఎందుకూ? నాన్న వద్దన్నా నేను మాటాడతానుగ" అంటూ సీత బావ బుజంమీద చెయ్యి వేసింది"

బా:- అదిగో చూడు నన్ను ముట్టుకోకు మామచూస్తే నన్నింట్లోంచి తరిమేస్తాడు. సరేగాని మీ అత్తవారింటికి ఎప్పుడు వెళతావు?

సీ:- మా అత్తవారిల్లంటే నాకిష్టం లేదు. అక్కడ నీలాగ నాతో ఎవరు మాట్లాడుతారు?

బా: తప్పు, సీతా! అలా అనకూడదు. నీ పెళ్ళికొడుకున్నాడుగదూ! అతనే మాట్లాడుతాడు.

సీ: బావ! నామాట నమ్మవు గాని, ఆ అబ్బాయంటే నాకేం సరదా లేదు. పెళ్ళిలోకూడా నువ్వే పల్లకీలో వుంటే బాగుండు ననుకున్నాను. మా అమ్మతో అంటే నా బుగ్గలు నులిమేసి "ఆ దరిద్రుడెక్కడ దొరికేడే నీకు; నిక్షేపంలాగ భాగ్యవంతుణ్ణి కట్టుకుంటూన్నానని సంతోషం లేదు" అన్నది. అప్పటినుంచి మరీ నీపేరెత్తలేదు.

వాసు:- నీకేమీ తెలీదు సీతా! నాకు ధనంలేదనే, వరుస అయినా మామామ నాకు నిన్నియ్యలేదు. ఒక్కగాను ఒక్క కూతురువుకదా? భాగ్యవంతునకిచ్చి సుఖిస్తే చూడాలని వారి ఆశ

సీ:- అదిగో అమ్మ పిలుస్తున్నది, భోజనానికి పోవాలి, నువ్వుకూడ పద అంటూ ఒక్క గెంతులో పారిపోయింది సీత.

వాసుదేవరావు సీత మేనత్త కొడుకు. వయస్సిరువది నాలుగేండ్లుండవచ్చును. B. A. ప్యాసయికూడ చిన్న వుద్యోగం జేస్తున్నాడు. చెంపకు,చేరెడు కండ్లు కన్నెత్తితే కనకాభిషేకం, మృదువైన స్వభావం, సరసమయిన హృదయము. సర్వాంగ సౌందర్యవతి సీత వలచిందంటే వింతేమిటి? చిన్ననాటి స్నేహంకూడ. మరునాడదే సమయానికి మరల అలంకరించుకొని తయారయింది. తన అలంకారాలు వాసు చూస్తేనే సార్థక మనుకుంటుంది. సిగరెట్టు పీలుస్తూ కండువా విసురుకుంటూ చిరునవ్వులో వాసు ప్రత్యక్షమయాడు. సీతకింకేంకావాలి. "ఎందుకింతాలస్యం చేసేవుబావా?" అంది.

"నువ్వింక మరచిపోవు కాబోలు, ఎంతచెప్పినా వినవు కదా..."? అన్నాడేగాని వాసుకి మాత్రం

ఇష్టంలేదూ? గాని ఏంచేస్తాడు. మామ చేసిన ద్రోహాన్ని, తన కర్మమనుకొని అనుభవించాలని ఆయన తలంపు. ఎట్లయినా సీతను తనను మరచి హాయిగా వుండమంటాడు, లేకుంటే చాలా బాధలున్నాయని అతనికి తెలుసును. అమాయక హృదయ బాలికయయిన సీతకేం తెలుసు?

నిత్యం ఇంటిముందు చిన్నతోటలో శృంగారించుకొని బావతో ఆడుకోవాలనుకుంటుంది. "చూడూ బావా ఈ రోజు ఇంట్లో ఎవ్వరూ లేరు. నాన్న కేమాను వెళ్ళేరు. అమ్మ వాళ్ళ ఇంటికి వెళ్ళింది. మన ఇష్టం వచ్చినంత సేపు మాట్లాడుకో వచ్చును, ఎవరూ ఏమీ అనరు. నువ్వెప్పుడూ మాసిన గుడ్డలు కట్టుకుంటావేం, మంచి బట్టలుకట్టుకొంటే ఇంకా ఎంతో బాగుంటావు, నువు ఇపుడేం గట్టుకున్నా నాకిష్టమే గాని అందరూ నిన్ను బీదవారంటారు అలా అంటే నాకెంతో కష్టంగా వుంటుంది. నీకు డబ్బులేక పోతే నాన్నకు తెలీకుండా నీకిచ్చేస్తాను లే. తీసుకుంటావా? అన్నది సీత.

ఆమె అపారమైన ప్రేమకు అతని మనసు కరగి నీరయింది. కండ్లు నీటితో నిండిపోయినవి. అతని వుత్తరీయంతో సీత కళ్ళుతుడిచింది.

సీ:- ఎందుకూ ఏడుస్తావు. బీదవాడవనా? చూడు నా దగ్గర ఎన్ని బంగారు గాజులున్నవో, ఇవన్నీ నీవు తీసుకో, నేను తొడుగుకునే కన్న నీవు తీసుకుంటే నాకెంతో ఇష్టం అన్నది.

బా:- నేను బీదవాడినని నాకేం విచారంలేదు. మన ప్రేమ నిలాపెంచి తరువాత మీ అత్తవారింట్లో చాలా దుఃఖపడుతావు. నీవు వెళ్ళిపోతే నేనెంత బాధపడాలో కదా అని?

సీ:- అస్తమానం అత్తవారిల్లంటావు నే నక్కడకు వెళ్ళనే వెళ్ళను.

బా: మరేం చేస్తావు?

సీ:- నీతోటే వుంటాను.

బా:- మరి మీనాన్న నిన్నేం చేస్తాడో తెలుసా?

సీ:- నీవు చూస్తూ వూరుకుంటావా!

బా:- ఏం చేయగలను?

సీ:- మీ వూరు పోదాం, పద.

బా:- మీ వాళ్ళను విడచి వస్తావా?

సీ:- నువ్వుంటే నాకెవ్వరూ అక్కరలేదు.

కొంచెం రోజులలో సీత అత్తవారింటికి వెళ్ళిపోయింది. ఇష్టంలేనప్పుడన్నీ కష్టమే, రోజూ బావను తలచి ఏడుస్తుంది, ఆమెకు దినమొక యుగంలా వుంది.

వాసుదేవరావు సీతవెళ్ళిన తరువాత ఆ యూరిలో నుండలేక ఆ వుద్యోగం వదలి, చెన్నపట్నం వెళ్లి దొరతనం వారి స్కాలరుషిపు - సంపాదించి డాక్టరీచదివి పెద్ద డాక్టరయేడు.

పురుషహృదయంకదా! చాలా కర్కశమయినది. సీతమీద ఎంతప్రేమవున్నా ఆమెవలె బెంగ పెట్టుకోలేదు. రోజులుగడిపేస్తున్నాడు సీత జ్ఞాపకంవుందో లేదో కూడ, ఒకనాడు సీత బావకిలా వుత్తరం వ్రాసింది.

"వాసుబావకి"

నీవు నన్ను మరచిపోయి నిర్విచారంగానున్నావు, నేను మాత్రం నిన్ను మరవలేను. నాకిచ్చట ఏలోపములేదు సకల భోగములున్నవి ఎందుకూ? నీవు లేవుకదా! చిన్న తోటలో నీవన్న మాటలు నా కానాడు భోదపడేవి కావు ఇప్పుడవన్నీ జ్ఞాపకంవస్తున్నవి. ఆయనతో మాటాడుట కూడ నాకిష్టంలేదు ఆయన నవ్వితే నీవు నవ్వినట్లుండదు. మాటలైన చేతగావు. భోజనం నిద్ర రెండు తెలుసును. మా నాన్న నాకు శిక్షచేసేడు కాని పెండ్లి చేయలేదు. నా జీవితమెట్లు గడపగలనో తెలియదు, ఈ బ్రతుకుకన్న చావే సుఖమని తలస్తున్నాను. ఇలా జరుగుతుందని తెలిస్తే నిన్ను ప్రేమించక పోయి వుందును. నా మనసింత దృఢమైనదని ఎరుగను బావా, నీకు కొంచమైనా బాధ వుందా? మహారాజులావున్నావు. అప్పుడు నీకు తెలిసేకూడ వూరకున్నావు, నా మీద కంటె నీమీదే నాకు ప్రేమ హెచ్చు, మా నాన్న దగ్గర నీకు భయం కొంచెమయినా ఆలోచించేవా? నీ కేంలే ఇప్పుడైన జ్ఞాపకంవున్నాను గనుకా! నీకు జాబు వ్రాస్తే నా

కేమి లాభం? గాని కొంతసేపైన నీతో మాటాడి నట్లుంటుందనీ శాంతి కోసం వ్రాసేను, నవ్వితే నవ్వు.

నీ సీత

తరువాత సీతకిలా జవాబువచ్చినది

(నా సీతకు!) చిన్ననాటి పిచ్చి నీకింకా వదల లేదూ? పిచ్చి పిల్ల విచారించి మరింత బాధేకదూ, ఇంకెన్నడూ జాబులు వ్రాయకు; మీ ఆయనకు తెలిస్తే నిన్ను నన్ను కూడ చంపుతాడు, ఇంకెప్పుడూ వ్రాయకు నీవీ జన్మలో నా పేరైన తలపరాదు. సంఘం నిన్ను నన్ను చూచి నవ్వుతుంది. నీ బంధువులు నిన్ను గౌరవించరు.

నేను నిన్ను మరచిపోయేనా? మరువగలనా? వెర్రిదానా! నా ఆరాధనా దేవతవు నీవు. నేను పెండ్లి చేసుకోలేదు, చేసుకోనుకూడ. ఈ యూరిలో స్త్రీలకేంలోటా! గాని, నాకంటి కెవ్వరూ నచ్చ లేరు. నీ చిన్ని చేతులతో కనులు మూసిన రోజులు, అవ్యక్త మధురములైన మాటలు, నీ ఆటలు నేను మరువగలనా? గాని నేనేమియు చేయలేను. నేను నీకులేను మన ప్రేమను సంఘ పిశాచమునకు బలిఇచ్చి నన్ను మరచిపో సీతా, మరచిపో॥

నీ బావ.

సీత జాబు చూసుకొని ఏడవక ఏంచేస్తుంది? చేతకానప్పుడే ఏడుపు; ఎన్నో దినములు గడిచినవి, సంవత్సరములు గడిచిపోయేయి, కాలం గడచిన కొలదీ వయసు, దాంతో జ్ఞానం హెచ్చయి హృదయం భారమయి పోతోంది. సీత చింతతో దహించి పోతోంది, ఎట్లో సంసారం గడుపుతోంది, శరీరం దుర్బలమయింది, ఎప్పుడూ జబ్బుగా వుంటుందిగాని జబ్బేమిటో తెలియదు. ఆయన చాలా డబ్బు ఖర్చుపెట్టి మందు లిప్పించేడుగాని కుదరలేదు. ఎప్పుడూ పండుకొనే యుంటుంది; నీరసముంటుంది మంచాని కంటుకుపోయింది. మంచి నీళ్లైనా త్రాగదు. సీత భర్త చాలా బెంగపెట్టు కున్నాడు. మదరాసు తీసుకు పొమ్మని అందరూ సలహా ఇచ్చేరు.

ఆ మరునాడు సీతతో ఆయన మదరాసు చేరి నాడు, సీత నడువలేని స్థితిలోనుంది. ఆమెను చేతులతో ఎత్తి కారులో చేర్చేడు. వాయు వేగంతో. కారు పోతోంది. జనరలాస్పటిల్ రోడ్డు పట్టింది బండి. ఇంతలో ఇంకొక కారు ఎదురుగా వస్తోంది. సీత కారును తప్పించలేకపోయేడు డ్రైవరు రెండు బండ్లు గుద్దుకొని ఆగిపోయినవి, సీత భర్త కూలి క్రిందపడ్డాడు సీతకు తెలివేలేదు రెండవ కారులోనున్న మనిషి ఇదంతా చూసి, ఆతనిని కారులోచేర్చి, హాస్పటిలులో ఇద్దరినీ బెడ్ మీద చేర్చేడు.

మూడుదినములకు సరియైన స్థితికి వచ్చినది సీత. తెలివివచ్చినను వైద్యులామెను మాటాడనీయలేదు. ఆమె భర్తస్థితి నర్సు నడిగిందిగాని నర్సు జవాబీయ లేదు. సమయానికామె కన్ని విధముల వుపచార ములు జరిగిపోవుచున్నవి గాని ఆమెతో ఎవ్వరూ మాటాడలేదు.

పెద్దదొరగారి అనుమతి నామెకు వున్నతమైన సేవలు జరుగుచున్నవి.

మధ్యాహ్నం మూడుగంటలవేళ సీత నిద్రలేచి చూచేసరికి ఎదుట కుర్చీలో ఆ నాటి సూటుమనిషి కూర్చొనియున్నాడు. ఆమె అదే పనిగా ఆయన వైపు చూస్తున్నది. ఏదో మాటాడబోయి మాటాడ లేకపోయి కంపించిపోయింది, తుదకు "బావా" అని భోరున ఏడుపు మొదలు పెట్టింది. వాసుదేవరావే అచ్చటి పెద్ద డాక్టరు. "భయపడకు సీతా నీకేమీ భయంలేదు, అసలే నీరసంగానున్నావు, మీసమా చారమంతా తెలసికొన్నాను, పాపము అభాగ్యుడు నీభర్తకూడ నిన్న చనిపోయినాడు, చాల పెద్దదెబ్బ తగిలింది" అన్నాడు. సీత ఈ ఘోరవార్త ఒక్క సారిగావిని తెలివి తప్పింది. వాసు వుపచారములు స్వంతంగా చేసేడు. సీతకు తెలివివచ్చిన తరువాత, "బావా! దిక్కులేనిదానినయి పోయేను. ఒంటిగా చిక్కుపడిపోయేను, మా నాన్న నీకు చేసిన ద్రోహం మరచిపోయి రక్షించవూ అంది" సీత. "నీబావ ఈ

నాడు ధనవంతుడైయున్నాడు. నేనెప్పుడూ నీ వాడనే అన్నాడు" వాసు.

పది దినముల తరువాత సీతకు బాగా నయమయింది. హాస్పటిలునుంచి తన ఇంటికి తీసుకొని వెళ్లినాడు వాసుదేవరావామెను. సాయంత్రం చల్లగాలిలో వారిద్దరు సంభాషిస్తున్నారు వాసు-సీతా. నీకు బాగా సుఖంగావుంది ఇక నీకు చికిత్స అవుసరంలేదు. బలమునకై మందులు వ్రాసి ఇస్తాను. జాగ్రత్తగా విశ్రాంతితీసికొంటే నీకింకా బాగా నయమయిపోతుంది, రేపు నాకు సెలవు నిన్ను మామ ఇంట దిగబెట్టేస్తాను పద" అన్నాడు.

సీ:-బావా! నీకు అన్నియు తెలుసును, నీవు నన్ను పరీక్షిస్తున్నావా? మా నాన్న నీకు చేసిన అన్యాయానికి నీవు నా ముఖం చూడకూడదు. నీవు పెండ్లి చేసుకోలేదంటే నేను నమ్మలేదు. ఇంత భాగ్యవంతుడవు కట్నముతో కన్యనిచ్చెదరు. అయినను నీ వంగీకరించలేదు. ప్రేమమూర్తివి, త్యాగమూర్తివి అంటే అతిశయంలేదు, నాన్న ఇంటికి నేను వెళ్లినను నిన్నే ఆరాధిస్తాను, బాహ్యానికి నాకు పెండ్లి అయింది నిజమేగాని, నేను మాత్రం పెండ్లాడలేదు. నేను బ్రహ్మచారిని; నమ్మితే నమ్ము. నిజంగా నేను వితంతువును కాను కన్యను. నా మనసు నా తనువు చిన్ననాటినుండియు నీకే అర్పణ చేశాను. దైవము ఈ నాటికి ఈ పరిస్థితులు కలుగజేసి అనుకూలుడయ్యేడు. నీవు నన్ను పెండ్లిచేసికోకున్న, నీకు దాసిగా వుంటాను. ఇప్పుడు నాకు నేనే అధికారిని.

వా:-సీతా! నీ వింతగా చెప్పనక్కరలేదు నేను నిన్ననుమానించలేదు. దైవమే మనకు వివాహం చేసేడు.

ఈ నాడు డాక్టరుగారి భార్య అయింది సీత. ఇంటి ముందు పెద్ద తోటలో శృంగారించుకొని మరల నిరీక్షిస్తున్నది బావకొరకు సీత. ఈల పాడుతూ బావ వచ్చేడు. తల్లో మల్లెపూలదండ సవరించుకుంటూ వెనుతిరిగి చూస్తే వాసు, "నీ పువ్వులు నేను బాగా సవరిస్తాను రా" అని చేతులు చాచేడు, ఆమె అతని చేతులలో వాలిపోయింది.

లక్షలు పొందడానికి

త్వర పడండి! మంచి అవకాశం!!

ధనికులగు ఫిలిం నిర్మాతలకు, పెట్టుబడిదారులకు, ఎగ్జిబిటర్లకు, డిస్ట్రిబ్యూటర్ల కిది చక్కని అవకాశం! కొంత నడిచిన యీ క్రింది ఫిలింల కథలు (తెలుగు, అరవం, హిందీలలో) సిద్ధంగా వున్నవి:—

1. పెద్దలిచ్చిన పెనిమిటి	8. భారతం	15. ఒకే రక్తం!
2. అంతా ఒకటే!	9. ఎల్లాంబ్రను	16. అవ్వ
3. బిచ్చగాడు	10. పేదరాలు	17. బలేపిల్ల!
4. ఎంత మోసం!	11. ఎన్న మోసం	18. దేశింగు
5. బాటసారి!	12. వీరబాల	19. షాప్
6. ఈ నర్తకి ఎవరు?	13. అజా	20. ఏడ్గురు కూతుళ్లు
7. కబడ్దార్	14. మాయావి	21. (గౌతమ) బుద్ధ.

సర్వాధికారులు: ప్రొఫెసర్. కె. ఆంజి, ఆంజి ప్రొడక్షన్సు,
15, వెస్టుకాట్ రోడ్డు, రాయపేట, మద్రాసు-14.